## సింగిల్ పేజీ కథలు

# అసలైన పండగ

‘‘ఏయ్ కాముడూ! ఇంకా ఆ వంటింట్లో ఏం చేస్తున్నావు? తొమ్మిది గంటలకంతా రంగనాథ్ వస్తానన్నాడు కదా. అప్పుడే పావుతక్కువ తొమ్మిది అయింది. రెడీ అవు'' అంటూ ముందు రూమ్‌లో అడ్డదిడ్డంగా కుర్చీలు నెమ్మదిగా సర్దుతున్నాడు రామశర్మ.

‘‘ఇదిగో! అయిపోయింది. మీక్కానీ మళ్లీ కాఫీ ఇవ్వనా వాళ్లు వచ్చేకా వాళ్లతోపాటు ఇవ్వనా'' అంటూ ముదురునీలం జరీచీర అంచులు సరిచేసుకుంటూ వచ్చింది కామాక్షి. అంతలో గేటు దగ్గర అలికిడి విని ఇద్దరూ అటు చూశారు.

‘‘ఏంటీ ఆంటీ బయటకి వెళుతున్నట్లున్నారే, రేపు వస్తాను'' అంటూ తెరిచిన గేటు మూయబోయింది రాజేశ్వరి.

‘‘లేదమ్మా రా! ఈరోజు ‘మదర్స్ డే' కదా! మా అబ్బాయిలందరూ వస్తారు. అదీ హడావిడి.''


గత రెండేళ్లుగా వాళ్ల కుటుంబంతో ఉన్న పరిచయం వల్ల రాజేశ్వరి ‘‘ఓ! అవును కదూ, మర్చేపోయాను'' అంటూ లోపలికి వచ్చి కుర్చీలూ అవీ సర్దడంలో తనూ సాయం చేయసాగింది. కామాక్షి ముఖంలో రోజూ చెప్పే రోగాల లిస్ట్ పోయి దాని స్థానంలో కొడుకుల్ని చూస్తున్నానన్న ఆనందంతో అసలే పచ్చగా ఉండే ఆ మొహం ఇంకా పచ్చగా వెలిగిపోతోంది. ముడిచుట్టూ కనకాంబరాలు అమర్చుకుంటూ ‘‘ఈ దండ ఇలా పెట్టు రాజీ! ఈ చేతులు వెనక్కి ముడిదాకా వెళ్లనంటున్నాయి'' అంటూ పువ్వులు పెట్టించుకుని ‘‘హమ్మయ్య!'' అంటూ కుర్చీలో కూలబడింది. తనూ ఇంకో కుర్చీలో కూర్చోబోతూ గుమ్మంలో ఆగిన తెల్ల అంబాసిడర్ కారుని చూసి ‘‘ఆంటీ! మీ పెద్దబ్బాయి వచ్చినట్లున్నారు'' అని తలుపు తియ్యడానికా అన్నట్లు గుమ్మంలోకి వెళ్లింది.

పెద్దకొడుకూ, కోడలూ చేతిలో కవర్లు పట్టుకొని లోపలికి వచ్చి ‘‘ఎలా ఉన్నారు?'' అంటూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

‘‘ఆ! మామూలే, మీరెలా ఉన్నారు? పిల్లల కబుర్లు తెలుస్తున్నాయా? ఆమధ్య చెయ్యి బెణికింది అని ఫోన్ చేసినప్పుడు కోడలు చెప్పింది. ఎలా ఉందిరా'' అంటూ ఇద్దరూ ఆత్రుతగా కొడుకునడుగుతుంటే రాజీకి ఆశ్చర్యం వేసింది.

‘‘ఆ! ఏం లేదులే! చెయ్యి తల క్రింద పెట్టుకు పడుకుంటే కాస్త బెణికింది అంతే'' అంటూ భార్యకేసి చూసి ‘‘ఆ స్వీట్లు, పళ్లూ ఇలాతే'' అన్నాడు. భారతి అందించిన స్వీట్లు, పళ్లూ కొంత డబ్బు తల్లి చేతికి ఇచ్చి తల్లికి, తండ్రికి దండం పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

‘‘అంత తొందరేముందిరా! కాఫీ తెస్తానుండు'' అంటూ ఆ కవర్లు పక్కన పెట్టి లోపలికెళ్లింది. అప్పటికే రాజీ స్టౌ దగ్గర కాఫీ కలుపుతోంది.



‘‘నీకెందుకమ్మా శ్రమ. నేను వస్తున్నాను కదా!''

‘‘ఫర్వాలేదులే ఆంటీ! మీరు మాట్లాడుతూ ఉండండి'' అంటూ నాలుగు కాఫీగ్లాసులు ఉన్న ట్రే ఆవిడ చేతికిచ్చింది.

‘‘నీకేది?'' అంటూ ఓ గ్లాసు ఇవ్వబోయింది.

‘‘వద్దులెండి ఆంటీ! ఇప్పుడే టీ తాగి వచ్చేను. మీరు నడవండి'' అంటూ ఆ ట్రేని తీసుకెళ్లి అందరికీ కాఫీలు ఇచ్చి ‘‘బాగున్నారా?'' అంటూ పలకరించింది.

‘‘ఆ! బాగున్నాం అమ్మా! మీరెలా ఉన్నారు? మీరు మా అమ్మనాన్నలకి చాలా హెల్ప్‌గా ఉంటారని చెపుతుంటారు'' తండ్రితో ఏవో విషయాలు మాట్లాడుతున్నాడు రంగనాథ్. వాళ్ల ఇంటి విషయాలు మాట్లాడుకుంటుంటే తనెందుకులే అని రాజీ లేచి వచ్చి గదిలో మంచంమీద కూర్చుంది.

మంచం పక్కనే ఉన్న పెద్ద స్టూలు నిండా ఏవేవో మందుసీసాలు, టాబ్లెట్స్, టానిక్కులు, వాటి మధ్యనే రామశర్మ మాస్టారు, కామాక్షి నలుగురు పిల్లలతో తీయించుకున్న ఫోటో చూస్తూ ఆలోచనలో పడింది. ఆ ఫోటో 25 సంవత్సరాల కిందటిది అయి ఉండవచ్చు. రామశర్మ మాస్టారు హైస్కూల్లో ఇంగ్లీష్ టీచర్‌గా చేసి రిటైర్ అయి 20 సంవత్సరాలు దాటిందిట. ఇప్పుడు ఆయన వయసు 76 సంవత్సరాలు అని కామాక్షిగారు చెప్పేరు. నలుగురు కొడుకులూ మంచి ప్రయోజకులు అయి అందరూ అదే ఊళ్లో ఒకరు ఇంజనీర్, ఒకరు లెక్చరర్, ఇద్దరు బ్యాంకుల్లో జాబ్స్‌లో స్థిరపడ్డారు. పెద్దబ్బాయి 4, 5 ఏళ్లల్లో రిటైర్ కూడా అవ్వబోతున్నాడు. కొడుకులందరికీ ఎవరు ఇష్టపడిన వాళ్లని వాళ్లకి పెళ్లిళ్లు జరిపించేరు. పెళ్లిళ్లయ్యాక ఎవరికి వాళ్లు సొంతంగా అపార్ట్‌మెంట్లు కొనుక్కొని వెళ్లిపోయారు. బాధ్యతలు తీరిపోయాయి కానీ రోజురోజుకీ పెరిగే వయసుతోపాటు ఈ దంపతులు పండుటాకుల్లా మిగిలేరు. అయినాసరే ‘మా దగ్గరుండాలి' అని వీళ్లు అడగనూ లేదు. వాళ్లు కూడా ‘అయ్యో ఈ వయసులో ఇలా వదిలేయడమా' అని ఆలోచించలేదేమో. అలా 70 ఏళ్లు దాటి కామాక్షమ్మ 76 ఏళ్లు దాటి రామశాస్త్రి గారూ మిగిలేరు. ఆయన రిటైర్ అయ్యేకా వచ్చే పెన్షన్ వాళ్లిద్దరికీ తిండి కంటే ఎక్కువ మందులకే అవుతాయి. అదీకాక ఆయన ఖాళీగా ఉండలేక ఇంగ్లీషు క్లాసులు చెబుతారు. ఆ ఇంట్లో మూడు గదులు వాళ్లు ఉంచుకుని ఓ మూడు గదుల పోర్షన్ రాజేశ్వరి వాళ్లకి అద్దెకిచ్చేరు. రాజీవాళ్లు అద్దెకి వచ్చి రెండు సంవత్సరాలైంది. రాజేశ్వరిని కూతురులా చూసుకుంటారు. ఆ పోర్షన్‌కి ఈ పోర్షన్‌కి గేట్లు కూడా వేరే ఉండడం వల్ల రోజూ రాజేశ్వరే వచ్చి ఈ ముసలాళ్లిద్దరికీ ఏమైనా అవసరం ఉందేమో చూసి ఈమధ్యే మాస్టారి దగ్గర ట్యూషన్‌కి వచ్చే వాళ్లతో పాటు తనూ ఇంగ్లీషు నేర్చుకుంటోంది.

‘‘అమ్మా! రాజీ! అన్నయ్యా వాళ్లు వెడుతున్నారుట'' అన్న కామాక్షమ్మ పిలుపుతో ముందు గదిలోకి వచ్చింది. వాళ్లతోపాటు గేటు దాకా ముగ్గురూ వెళ్లారు. అంతలో ఎర్ర మారుతికారు వచ్చింది. మాస్టారు రెండో కొడుకు వచ్చేడన్న

మాట అనుకుంటూ ''నేను వస్తానాంటీ'' అంటూ రాజీ వెళ్లిపోయింది.

ఇంట్లోకి వచ్చినా రాజీ ఆలోచనలన్నీ వాళ్లమీదే ఉన్నాయి. ఇంత ప్రేమగా ఉండే ఈ కొడుకులందరూ ఒక్కళ్లైనా తల్లిదండ్రుల దగ్గర ఉండాలని కానీ వాళ్లని దగ్గర పెట్టుకుందామని కానీ ఆలోచనే రాదా? సంక్రాంతి, ఉగాది, విజయదశమి, దీపావళి వాటితోపాటు ఈమధ్య కొత్తగా వచ్చిన ఈ 'మదర్స్ డే'కి వచ్చి నలుగురూ బట్టలూ, స్వీట్స్, పళ్లతోపాటు మందులకి అంటూ కొంత డబ్బు ఇచ్చి వెళ్లిపోతారు. పెద్దకొడుకు అంబాసిడర్, రెండో కొడుకు ఎర్రమారుతీ, మూడోవాడు జెన్, నాలుగో అబ్బాయి ఇండికాలో వచ్చి వెళుతుంటే ఆ పండగలే ఈ ముసలి దంపతులకి అసలైన పండగలు. ఉత్తప్పుడంతా ఆ కామాక్షమ్మగారు ఇంటికి ఎవరు వచ్చినా కాలునెప్పి చెయ్యి నెప్పి అంటూ రోగాలతోపాటు తను వాడే మందుల లిస్ట్, ఆయన వాడే మందుల లిస్ట్ చెప్పేవారు. అలాంటిది కొడుకులు వచ్చే రోజు మాత్రం ఇద్దరూ నవదంపతుల్లా తయారైపోయి వాళ్లకి స్వాగతం చెపుతారు.

కానీ రాజీకి అర్థంకానిదొక్కటే. వాళ్లకి ఈ వయసులో స్వీట్లూ, బట్టలూ, ఆభరణాలు అవసరమా అని.

ఓపికున్న రోజు వండుకుని, లేని రోజు ఏ టిఫిన్లో తెప్పించుకుని తింటూ గడిపే ఆ ముసలి దంపతుల ముఖాల్లో ఎప్పటికీ ఆ సంతోషం, హుషారు చూడాలంటే ఊళ్లోనే అందరికీ కార్లున్నాయి కాబట్టి కొడుకులు వారానికో, పది రోజులకో ఒకసారి వచ్చి వెళుతుంటే ఆ దంపతులిద్దరూ నూరేళ్లూ ఆరోగ్యంగా ఉండి మదర్స్‌డేలు కాదు, పేరెంట్స్‌డేలు చేసుకుంటారని ఆ కొడుకులందరికీ గట్టిగా చెప్పాలని తనలో తనే ఆవేశపడిపోయింది.

అంతలో గేటు తీసుకొని కొడుకులు తెచ్చిన స్వీట్లు, పళ్లు ప్లేటులో పట్టుకుని పార్వతీదేవిలా నడిచి వస్తున్న కామాక్షమ్మగారిని చూసి మదర్స్‌డే అర్థం పూర్తిగా తెలియకపోయినా రాజీకి ఆ మాతృమూర్తి అసలైన దేవతలా కనిపించి కళ్లు చెమరించాయి. అసంకల్పితంగా లేచి వెళ్లి ఆమెకి నమస్కరించింది.

**-ఎం.లక్ష్మి** (బెంగుళూరు)

# విధివిలాసం

ఉదయం ఆలస్యంగా నిద్రలేచిన రాఘవ తమ ఫ్యాక్టరీ వర్క్స్ మేనేజర్ పాండే ఇంట్లో ప్రమాదం జరిగిందని తెలియడంతో ఉన్నఫళంగా పరిగెత్తాడు.

రాఘవ వెళ్లేసరికి పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. ఎల్.పి.జి. సిలిండర్ లీక్ అవడంతో పాండే భార్య గమనించలేదట. వంట చేస్తుంటే సడెన్‌గా సిలెండర్ పేలిపోయి ప్రమాదం సంభవించింది. వంటిల్లూ, ఆ ప్రక్క గదీ పూర్తిగా శిథిలమైపోయాయి. చావుబతుకులలో ఉన్న పాండే భార్యను ఆసుపత్రికి తరలించారు.

పాండేని పలకరించే ధైర్యం చాలక పేలుడు సంభవించిన ప్రదేశాన్ని చూపులతోనే సర్వే చేశాడు రాఘవ. అతని దృష్టి పేలుడికి కరిగిపోగా తునాతునకలయి పడివున్న సిలిండర్ ముక్కలలో ఒకదానిమీద పడింది. అప్రయత్నంగా దానిని తీసిన రాఘవ అదిరిపడ్డాడు.


ఆ ముక్కమీద ఎర్రటి పెయింట్‌తో పెట్టిన ఇంటూ మార్క్ ఉంది. మరుక్షణం నెల రోజుల క్రితపు సంఘటన అతని మదిలో మెదిలింది.

గ్యాస్ సిలిండర్లను తయారుచేసే కంపెనీలో క్వాలిటీ కంట్రోలు ఇంజనీరుగా పనిచేస్తున్న రాఘవ, ఆరోజు వర్క్స్ మేనేజర్ పిలుస్తున్నాడని చెప్పటంతో బెదురుతూనే వెళ్లాడు.

''మిస్టర్ రాఘవా! వాటీజ్ దిస్?'' గర్జించాడు వర్క్స్ మేనేజర్ తన ముందున్న కాగితాన్ని అతనికి చూపిస్తూ.

ఫ్యాక్టరీలో కొత్తగా తయారైన ఖాళీ సిలిండర్ల మొత్తం బ్యాచ్‌నే క్వాలిటీ సరిగా లేదని రిజెక్ట్ చేస్తూ క్రితం రోజున రాఘవ రాసిన రిపోర్టు అది.

తమ కంపెనీ యల్.పి.జి. సిలిండర్లను తయారుచేసి గ్యాస్ కంపెనీలకు సప్లయి చేస్తుంది. వాటిని గ్యాస్‌తో నింపి కస్టమర్స్‌కి సప్లయి చేస్తాయి గ్యాస్ కంపెనీలు. ఆ సిలిండర్ల తయారీలో క్వాలిటీ కంట్రోల్‌ని జాగ్రత్తగా పాటించకపోయినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఫ్యాక్టరీ తయారుచేసిన లేటెస్ట్ లాట్ క్వాలిటీ విషయంలో సంతృప్తికరంగా లేకపోవడంతో దాన్నంతా రిజెక్ట్ చేశాడు



రాఘవ. వాటిని మార్కెట్ చేయడానికి వీల్లేదంటూ అదే విషయం వివరంగా చెప్పాడు అతను వర్క్స్ మేనేజర్‌తో.

''నాన్సెన్స్! మొత్తం లాటంతా రిజెక్ట్ చేస్తే కంపెనీకి ఎంత నష్టం వస్తుందో ఆలోచించావా?'' రంకెలు వేశాడు వర్క్స్ మేనేజర్. ''వెంటనే వాటిని రీఎగ్జామిన్ చేసి ఓకే చెయ్యి.''

''అయాం సారీ సార్! నేను క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ని. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చి ప్రజలను రిస్కులో పెట్టలేను'' అంటూ కచ్చితంగా చెప్పేశాడు రాఘవ అతని అరుపులకు బెదరకుండా.

''డోంట్ బీ సిల్లీ! ఐదువేలు జీతమిచ్చి నిన్ను పనిలో పెట్టుకున్నది ఫ్యాక్టరీ సరుకంతా రిజెక్ట్ చేస్తావని కాదు. సర్టిఫై చేస్తావని. ఇప్పుడు ఆ సిలిండర్లు సర్టిఫై చేయకపోయావంటే నిన్ను ఉద్యోగంలో నుంచి తీసివేయాల్సి ఉంటుంది. జాగ్రత్త'' అంటూ తీవ్రంగా హెచ్చరించాడు మేనేజర్.

రాఘవ ఉద్యోగం కోసం మనస్సాక్షిని చంపుకోలేక వెంటనే రాజీనామా ఇచ్చేసి వచ్చేశాడు. అతికష్టం మీద ఆర్నెల్ల క్రితం సంపాదించిన ఆ ఉద్యోగం అలా వదులుకోవటంతో మళ్లీ ఉద్యోగాల వేటలో పడ్డాడతను.

తాను రిజెక్ట్ చేసిన సిలిండర్లను కంపెనీ మార్కెట్ చేసిందనీ, వాటిలో ఒకటి విధివశాత్తు వర్క్స్ మేనేజర్ ఇంట్లోకి వచ్చిందనీ, ఆ సిలిండర్ ముక్కను చూడగానే గ్రహించాడు రాఘవ. ఇంకా ఎందరు అటువంటి ప్రమాదానికి గురికానున్నారోనని అతని గుండె ఝల్లుమంది.

రిజెక్ట్ చేస్తూ తాను పెట్టిన ఇంటూ మార్కున్న సిలిండర్ ముక్కను చూస్తూ నిశ్చేష్టుడైన రాఘవ దగ్గరకు వచ్చాడు వర్క్స్ మేనేజర్ పాండే. ఆ గుర్తును అతనికి చూపించాడు రాఘవ మౌనంగా.

అర్థం చేసుకున్న పాండే వదనంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేకుండా పోయింది.

**-బద్దిగం పాండురంగారెడ్డి**
(కరీంనగర్)